ప్రజాశక్తి

శనివారం 21 డిసెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం




అనకాపల్లి

పోరు కెరటం సిపిఎం

- ఎన్నో విజయాలు సొంతం
- భూ పోరాటాలతో పట్టాల సాధన
- నాన్ షెడ్యూల్ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పన
- నిర్వాసితుల సమస్యలపై నిరంతర ఆందోళన



దేవరాపల్లిలో భూ పోరాట ర్యాలీ (ఫైల్ ఫోటో)



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సిపిఎం నిరంతర పోరాటాలతో అనకాపల్లి జిల్లాలో ఎన్నో విజయాలు సాధించింది. జనపక్షమై నిలిచింది. సాగు భూమిపై హక్కు దక్కని పేదలకు పోరాటాలతో పట్టాలు ఇప్పించగలిగింది. ఆక్రమణదారులను తొలగించి సాగుదారులకు అప్పగించింది. నాన్ షెడ్యూల్ ప్రాంతంలోని గిరిజనులు, దళితులు, పేదల భూముల్లో పెత్తందార్ల పెత్తనం లేకుండా చేసింది. అక్రమ కేసులతో భయపడుతున్న బాధితులకు భరోసానిచ్చింది. భూమిలో చెట్టు, మొక్క పేదలకు దక్కేలా చేసింది. తాగునీరు, రహదారుల్లేని గిరిజన గ్రామాల్లో సౌకర్యాలు కల్పించాలన్న డిమాండ్‌పై ప్రజలను కదిలించింది. ప్రభుత్వ యంత్రాంగంపై ఒత్తిడిచేసి కొన్ని సదుపాయాలు లభించేలా చేసింది. పేదల బాధ తెలిసిన మార్క్సిస్టు పార్టీ బాధిత ప్రజలను ఏకంచేసి పోరాటాల వైపు నడిపించింది. నిరాశతో బతుకుతున్న ప్రజలకు పోరాటాలతో సాధించుకోవచ్చనే ఆశ, విశ్వాసం కలిగించింది.

నక్కపల్లి మండలం గునిపూడిలో దళితులు, వృత్తిదారులకు, రోలుగుంట మండలం జెపి అగ్రహారం, రావికమతం, దేవరాపల్లి, వి.మాడుగుల, గొలుగొండ మండలం బుడ్డపాడుల్లో గిరిజనుల సాగు భూమిపై పట్టాలు ఇప్పించింది. దేవాదాయ భూముల ఆక్రమణలను ఆడ్డుకుంది. రాంబిల్లి మండలం మూలజంప, మూలకొత్తూరు, పంచదార్ల, లాలం కోడూరులో భూ సమస్యపై పోరాటాలు చేపట్టింది. అచ్యుతాపురం మండలం బార్క్, నక్కపల్లి మండలంలో వైజాగ్-చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, ప్యాకేజీ చెల్లింపు కోసం పోరాటాలు కొనసాగిస్తోంది. రావికమతం మండలం కొవగుంట పంచాయతీలో గ్రానైట్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయించి గిరిజనులు, పేదలకు భూములు తిరిగి అప్పగించడంలో విశేష కృషి చేసింది. ఉల్లోవ భూములు కోల్పోయిన గిరిజనులకు నష్టపరిహారం ఇప్పించింది. పాత ఒప్పందాలు అమలు చేయాలని ఎన్ఎఒబి నిర్వాసితుల పోరాటానికి అండగా నిలిచింది.

నాన్ షెడ్యూల్ ప్రాంతంలో పోరాటాలు ఇలా..

దేవరాపల్లి, చీడికాడ, వి.మాడుగుల మిగతా 2లో..

మహాసభకు వేళాయె..

- ఎర్ర జెండాలు, తోరణాలతో నర్సీపట్నం ముస్తాబు
- నేడు ర్యాలీ, బహిరంగ సభ
- హాజరుకానున్న వై.వెంకటేశ్వరరావు, కిల్లో సురేంద్ర, జగ్గునాయుడు



ఎర్రజెండాలతో ముస్తాబైన నర్సీపట్నం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నర్సీపట్నం టౌన్ విలేకరి

ఈ నెల 21, 22న జరిగే సిపిఎం అనకాపల్లి జిల్లా 24వ మహాసభకు అతిథ్యమిస్తోన్న నర్సీపట్నం ఇప్పటికే ఎర్ర తోరణాలతో ముస్తాబైంది. పట్టణంలోని కూడళ్లలో ఎర్రజెండాలు రెపరెపలాడుతున్నాయి. వేదికను పార్టీ కార్యకర్తలు సుందరంగా తీర్చిదిద్దారు. తొలి రోజు 21న ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభం కానుంది. ఈ ర్యాలీ ఎల్ఐసి బిల్డింగ్ నుంచి ప్రారంభమై అబిద్ సెంటర్‌కు చేరుకుంటుంది. అక్కడ 11 గంటలకు మిగతా 2లో..

మహాసభలో ఉద్యమ కార్యాచరణ

పార్టీ జిల్లా మహాసభలో గత కార్యక్రమాలపై చర్చించి, భవిష్యత్తు పోరాటాలను రూపొందిస్తాం. జిల్లాలో వివిధ తరగతుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నాం. జిల్లా సమగ్రాభివృద్ధికి ఉద్యమ కార్యాచరణ తయారు చేయనున్నాం. మహాసభ తొలిరోజు కార్యదర్శి నివేదిక ఉంటుంది. రెండో రోజు నూతన కమిటీని మహాసభ ఎన్నుకోనుంది.

– కె.లోకనాథం, సిపిఎం జిల్లా కార్యదర్శి

స్థాయీ సంఘంలో అభివృద్ధి పనులకు ఆమోదం

వార్త 2లో..

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

వార్త 5లో..

వైసిపికి విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్ రాజీనామా

వార్త మెయిన్‌లో..

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు చర్యలు

కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల గురించి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు అనువైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో అధికారులు పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గాజువాక ఆటోనగర్ వద్దగల కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రోడ్ ఓవర్ బ్రిడ్జి, పెదగంట్యాడ, అగనంపూడి, ఆటోనగర్‌లలో ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, సింగిల్ విండో క్లియరెన్స్, పిఎం విశ్వకర్మ యోజన పథకం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీలేఖ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం

- తడిసిన వరి పనలు
- క్యాబేజీ, మిరప, దొండ, మొక్కజొన్న పంటలకు నష్టం
- కోతకు గురైన సముద్ర తీరం
- కొండవాలు ప్రాంత వాసుల్లో భయాందోళన



బుచ్చయ్యపేటలో తడిసిన వరి పనలను చూపుతున్న రైతులు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షానికి విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పంటలకు అపార నష్టం వాటిల్లింది. విశాఖ జిల్లా పద్మనాభం మండలంలోని రెడ్డిపల్లి, సుంకరపేట, కోరాడ, గెద్దపేట గ్రామాల్లో క్యాబేజీ పంటకు నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో మిరప, దొండ, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, బుచ్చయ్యపేట, మాడుగుల సహా పలు మండలాల్లో కోసిన వరి పనలు తడిసిపోయాయి. విశాఖలోని పెదగంట్యాడ హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ పాత ఇంటి మెట్లు కూలాయి. 92వ వార్డు ఇందిరానగర్‌లో రోడ్డు పక్కనున్న ఓ ఇంటి ప్రహరీ కూలింది. భీమిలి, విశాఖ ఆర్‌కె బీచ్‌ల్లో ఒడ్డు కొంత మేర కోతకు గురైంది. కొండవాలు ప్రాంతాల ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళనతో ఉన్నారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్ పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

(వార్తలు లోపలి పేజీల్లో..)



కొండవాలు ప్రాంతమైన ఇందిరా నగర్‌లో కూలిన ప్రహరీ

స్థాయీ సంఘంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. ఆ వివరాలను స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో సమావేశం జరగ్గా 71 ముఖ్య అంశాలు, 2 టేబుల్ అజెండాలతో కలిపి మొత్తం 73 అంశాలను పొందుపరిచినట్టు ఆమె తెలిపారు. వాటిపై స్థాయీ సంఘం సభ్యులు చర్చించిన పిదప 4, 5, 26, 67 అంశాలను వాయిదా వేసినట్టు వెల్లడించారు. మిగిలిన 69 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి పనులకు, రెవెన్యూ అంశాలకు సంబంధించి గుత్తలు, ఉద్యోగుల సర్వీసులకు సంబంధించి అంశాలు చర్చకురాగా వాటికి సభ్యులు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హరి వెంకట కుమారి

సమావేశంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవారెడ్డి, 4వ జోనల్ కమిషనర్ ఎమ్.మల్లయ్య నాయుడు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసరు ఎ.అప్పలనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఎస్.శేఖర్, కె.శాంతిరాజ్, పివి.గంగాధరరావు, ఎస్.చిరంజీవి, జి.శ్రీరామమూర్తి, టి.ప్రసన్న, ఎఎమ్ఒహెచ్‌లు డాక్టర్ ఎ.సునీల్ కుమార్, బి.ప్రసాదరావు, ఎసిపి కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ ఆసుపత్రికి మల్టీపర్పస్ వెహికల్ వితరణ


వెహికల్ అందజేత కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ తన సిఎస్ఆర్ నిధులతో విశాఖలోని హోమీబాబా కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు మల్టీపర్పస్ వెహికల్‌ను విరాళంగా అందజేసింది. ఈ వాహనాన్ని హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ (సిపి అండ్ పి) సిఎమ్‌డి రాకేశ్ ప్రసాద్ శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ఎల్ ఉన్నతాధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే ఏడాది మరింత ఘనంగా బాలోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వచ్చే ఏడాది విశాఖ బాలోత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహిస్తామని బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు అన్నారు. గత నెలలో నిర్వహించిన విశాఖ బాలోత్సవంలో పాల్గొన్న పాఠశాలల ఆత్మీయ సమావేశం శుక్రవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. బాలోత్సవంలో పాల్గొన్న స్కూళ్లకు జ్ఞాపికలు అందజేశారు. సమావేశానికి బాలోత్సవం అధ్యక్షులు రఘు అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.రమాప్రభ, సిహెచ్.సత్యనారాయణ పాల్గొని విశాఖ బాలోత్సవం నిర్వహించిన తీరును వివరించారు. అందుకు సహకరించిన సెయింట్ ఆంథోనీ స్కూల్ రత్నకుమార్‌కు, పాల్గొన్న స్కూల్ యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. హాజరైన ప్రతినిధులు బాలోత్సవ నిర్వహణపై అనేక విలువైన సూచనలు చేశారు.



జ్ఞాపికలతో పాఠశాలల ప్రతినిధులు

మొదటి పేజీ తరువాయి..

పోరు కెరటం సిపిఎం

మండలాల్లో గిరిజనుల సాగులోని పోడు, ఫారెస్టు భూములకు పట్టాలివ్వాలని చేసిన ధర్నాలతో 11 వందల మందికిపైగా పట్టాలు పంపిణీ జరిగింది. గొలుగొండ, నాతవరం, వి.మాడుగుల, రోలుగుంట, రావికమతం మండలాల్లో సాగు భూములపై గిరిజనులకు అటవీ హక్కుల చట్టం కింద పట్టాలు ఇవ్వాలని చేసిన పోరాటాలతో నాన్ షెడ్యూల్ గిరిజన ప్రాంతంలో 4,500 హక్కు పత్రాలు మంజూరు చేశారు. నాన్ షెడ్యూల్ ప్రాంతంలోని కోటవురట్ల మండలం అణుకుకు రహదారి, పాఠశాల ఏర్పాటు చేయాలని 49 రోజులు గిరిజనులు చేపట్టిన రిలే దీక్షలతో పాఠశాల, రహదారి మంజూరైంది. రేషన్ సరుకులు గ్రామంలో ఇస్తున్నారు. దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ నగరంపాలెం, చింతలపూడి పంచాయతీ బలిపురం, వీలుపర్తి పంచాయతీ మారికకొండ ప్రాంతాల్లో అదానికి చెందిన పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులకు సేకరిస్తున్న మట్టి నమూనాలను ప్రజలను సమీకరించి అడ్డుకుంది. ఉపాధి పనులు కల్పించాలని రావికమతం, వి.మాడుగుల, కోటవురట్ల, దేవరాపల్లి, రోలుగుంట, ఎస్.రాయవరం, నక్కపల్లి, మునగపాక, కె.కోటపాడు, పరవాడ, అచ్యుతాపురం, సబ్బవరం మండలాల్లో ఆందోళనలు చేసి పనులు కల్పించేలా చేసింది. రావికమతం మండలం గదబపాలెం, రామన్నపాలెం, దోలవానిపాలెం గిరిజనులకు జాబ్ కార్డులు మంజూరు చేయించింది.

భారాలపై గర్జన

ప్రభుత్వాలు వేసిన చెత్త, ఆస్తి పన్ను భారాలకు, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలకు వ్యతిరేకంగా అనేక నిరసన కార్యక్రమాలను సిపిఎం చేపట్టింది. అనకాపల్లిలో పెంచిన ఆస్తి, చెత్త పన్నులను రద్దు చేయాలని పాదయాత్ర నిర్వహించింది. నర్సీపట్నం మున్సిపాల్టీలో ఆస్తి పన్ను పెంచకుండా కౌన్సిల్‌లో తీర్మానం చేసేలా ఒత్తిడి తెచ్చింది. తుదకు చెత్త పన్ను రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించక తప్పని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో ముందుకొచ్చిన ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూనే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. జిల్లాలో వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ మీటర్ల ఏర్పాటుపై నిరసన చేపడుతూనే, మునగపాక మండలంలో అడ్డుకుంది. రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ జీడుగులోవ, నేరేడుబందకు విద్యుత్ సౌకర్యం కల్పించగలిగింది.

ముఖ్యమైన పోరాటాలు

అనకాపల్లి - అచ్యుతాపురం రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని చేసిన పోరాటం ఫలప్రదమైంది. అనకాపల్లి మండలంలో నకిలీ డ్వాక్రా గ్రూపుల అవినీతిపై జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని సిపిఎం చేసిన పోరాటంతో విచారణ జరిగింది. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరించి పునరుద్ధరించాలని, రైతులు, కార్మికుల బకాయిలు చెల్లించాలని అనేక కార్యక్రమాలు చేపట్టింది. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యం పెరిగేలా ఆధునికీకరించి సకాలంలో రైతులకు బిల్లులు చెల్లించాలని పోరాటాలు చేపట్టింది. తాండవ, ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీల రైతులు, కార్మికుల బకాయి చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించింది. తాండవకు రూ.10.56 కోట్లు, ఏటికొప్పాకకు రూ.8.50 కోట్లు విడుదల చేసింది. అనకాపల్లి మండలం కూండ్రం, వేటజంగాలపాలెం, పాపయ్యపాలెంల్లో ఇళ్ల స్థలాల ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన వారికి లే అవుట్‌లో ప్లాట్లు ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేసిన క్రమంలో బాధితుల పక్షాన సిపిఎం ఒత్తిడి చేసింది. దీంతో భూ సమీకరణలో భూములు కోల్పోయిన వారికి ప్లాట్లు ఇచ్చే పని ప్రభుత్వం ప్రారంభించింది. ఆవు పాలకు విశాఖ డెయిరీ మూడు రూపాయల ధర తగ్గింపుపై సిపిఎం స్పందించింది. తగ్గించిన పాల ధరను పునరుద్ధరించి, డెయిరీ పెంచిన దాణా ధరలు తగ్గించాలని ఆందోళన చేసిన రైతులకు మద్దతుగా నిలబడింది. విశాఖ డెయిరీ నిధుల అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. తీర ప్రాంతంలో పరిశ్రమల కాలుష్యం, మత్స్యకారుల జీవనోపాధి సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తోంది.

మహాసభకు వేళాయె..

బహిరంగ సభ జరగనుంది. ఈ సభలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కిల్లో సురేంద్ర, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ప్రసంగించనున్నారు.

గడిచిన మూడేళ్ల కాలంలో అనేక ప్రజా సమస్యలపై సిపిఎం పోరాటాలు చేపట్టింది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిర్వహించిన పోరాటాల్లో ప్రజలను భాగస్వాములు చేసింది. ఈ పోరాటాల్లో అనుభవం కలిగిన రెండు వందల మంది మహాసభకు ప్రతినిధులుగా జిల్లా నలుమూలల నుంచి హాజరుకానున్నారు. మూడేళ్ల కాలంలో పార్టీ చేపట్టిన పోరాటాలపై మహాసభ సమీక్షించనుంది. ప్రజా సమస్యలపై భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందించనుంది. జిల్లా సమగ్రాభివృద్ధికి, గ్రామీణ ప్రాంత భౌగోళిక పరిస్థితులు, వివిధ తరగతుల ప్రజల సమస్యలపై పలు తీర్మానాలు చేయనుంది.

ఘనంగా పోర్టు అంతర విభాగాల క్రీడోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీలో 54వ అంతర విభాగాల క్రీడోత్సవాలు పోర్టు డైమండ్ జూబ్లీ స్టేడియంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం పోర్ట్ స్పోర్ట్స్ కౌన్సిల్ గౌరవాధ్యక్షులు, పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేశ్ కుమార్ దుబే ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ క్రీడోత్సవాల్లో క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిడ్, బాడీ బిల్డింగ్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్ వంటివి ఉన్నాయి. పురుష, మహిళా ఉద్యోగులతో పాటు విభిన్న ప్రతిభావంతులకు పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ క్రీడలలో విజేతలుగా నిలిచిన వారికి 2025న రిపబ్లిక్ డే సందర్భంగా బహుమతులు అందజేసి సత్కరించనున్నారు. క్రీడల ప్రారంభ కార్యక్రమంలో టి.వేణుగోపాల్, ఎస్.శివ కుమార్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ గాజువాక ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EA 402/2022 IN EP 63/2021 IN O.S. 91/2015

బిట్వీన్ :
దుగ్గపు సత్యనారాయణ S/o దానయ్య, హిందూ, వయస్సు 35సం॥లు. ఉద్యోగి D.No.30.6.5 దుగ్గపువానిపాలెం, వడ్లపూడి RHC, గాజువాక ...DHR
అండ్
అయితి భాగ్యలక్ష్మి ...JDR
టు,

ఆర్డర్ 21 రూల్ 52 నోటీసు

అయితి భాగ్యలక్ష్మి w/o కన్నారావ్, హిందూ వయస్సు 45 సం॥లు D.No.30-85-2 కణితి తెలుకల వీధి. RH కాలనీ, వడ్లపూడి, గాజువాక.

పై నెంబరు EPలో శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం **తే.07-01-2025**దికి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం **10.30ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ తరపున లాయరు గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబరు EP తీర్మాణించబడును.

ఎ.వెంకటేశ్వరరావు
బి. మాధవి, ఎస్.వి.లక్ష్మి
DHR తరపు అడ్వకేట్స్, గాజువాక

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLE.
I.A.334/2022 in O.S.No.133 of 2020.

Between:
Gandiboyina Parvathi and another ... Petitioners
And :
Musili Gangaraju & another ... Defendants

To,
R2) Eadhala Nookaratnam w/o Sanyasirao, Hindu, aged 38 years, household duties, residing at D.No.10-18-36, Nidanam Doddi, Gavarapalem, Anakapalle, Visakhapatnam District.

I A Notice.

The Petitioners / Plaintiffs have filed the above petition for passing of final decree in terms of preliminary decree and the above petition stands posted to dt.31-12-2024 for your appearance. Hence you are here by directed to appear either personally or through your counsel on that day before the above court, and if you fail to appear on or before **10.30 A.M.** on **DT.31-12-2014** the matter will be proceeded in your absence.

P.A.Narasimham,
S.Kumar Ratnam,
Advocates,
Anakapalle.
94400 25466.

Anakapalle,
Dt.15-12-2024.

IN THE HON'BLE COURT OF THE IV ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT : VISAKHAPATNAM
O.S.66/2024

Between:
Sri Chuchikonda Nooka Raju ...Plaintiff
And
Sri Jami Kameswara Rao ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Sri Jami Kameswara Rao, S/o. Sri Ramulu, Hindu, aged about 42 years, R/at. D.No.38-38-1/C, Mohiddin Gardens, Marripalem, Visakhapatnam.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of an amount of **Rs. 4,18,600/-** with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **09-01-2025** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **09-01-2025** at **10:30A.M.,** in the above mentioned Court, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
G. RADHA KRISHNA MURTHY,
Advocate
Allipuram,Visakhapatnam.
Cell: 9848265567.

IN THE HON'BLE COURT OF THE V ADDL. JUNIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
O.S.1142/2022

Between:
State Bank of India, RACPC-1, SAR Wing, Siripuram, Visakhapatnam, Rep. by its Manager ...Plaintiff
And
Tirumalaraju Priyanka & another ...Defendants

SUMMONS

To,
D-1: Tirumalaraju Priyanka (Student), D/o. Tirumalaraju Manidhar Kumar, aged 32 years, D.No.55-14-102/1, No.126, APSEB Colony, Seethammadhara, Visakhapatnam-13 and also FF-4, Yechuri Fort Apartments, Seethammadhara, Near Alluri Sitaramaraju Statue, Visakhapatnam-13.
D-2: Sri Tirumalaraju Manidhar Kumar (Guardian) S/o. Sri Tirumalaraju Suryanarayana Varma, aged 64 years, Rest-do-

Please take notice that the above named plaintiff has instituted the above suit against both of you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **30-12-2024** for your appearance on that day **10:30 A.M**. you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
K. VEDAVATHI,
Advocate,Visakhapatnam.

BEFORE THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
E.P. 38/2024 in O.S. 229/2019

Between:
Smt. Beri Hemavathi .. D.Hr
And:
Sri. Gunturu Narayana Murthy ..J.Dr

AUCTION NOTICE

It is hereby informed to the public at large that the D.Hr/plaintiff i.e., Smt. Beri Hemavathi, filed the suit against the defendant i.e., **Sri. Gunturu Narayana Murthy** vide O.S No.229/2019 on the file of Hon'ble Principal Junior Civil Judge Court at Bheemuni patnam and same was decreed in favour of the D.Hr/plaintiff. Subsequently the D.Hr/plaintiff filed the above **E.P No.38/2024** against the J.Dr/defendant on the file of **Honourable Principal Junior Civil Judge Court at Bheemunipatnam** for recovery of E.P. amount. The Hon'ble Court was directed to publish the schedule mentioned property in **Public Auction for Sale Proclamation** i.e., RCC slabbed house measuring an extent of 36.95 sq Yds. bearing D-No-LIG-B- 347, undivided and unspecified including common area and balcony in the first floor, Covered by Survey No.137/Part, Situated at Sagar Nagar, present Ward No-8, Chinagadhili Mandal, Visakhapatnam-45, within the limits of GVMC Municipal Corporation and bounded by as follows :

EAST : Common open area.
SOUTH : House No. LIG-B-344.
WEST : Common open area.
NORTH : Common Stair case

DHR Value of Rs. 15,48,156/- (Rupees Fifteen Lakhs forty eight thousand one hundred and fifty six only) and **Amin value of Rs. 15,48,156/-** proclaimed and sell in publication on Prajasakthi Telugu, Daily Newspaper.

The Sale Proclamation for Public Auction is to be held on **07-01-2025** and the same was published in a Prajasakthi Telugu daily newspaper.

G Rama Rao & D Eswara Rao
Advocates, Bheemunipatnam,
Visakhapatnam-531163.
Cell No.8341988677,8790796439.

పంట పొలాలల పరిశీలన

ప్రజాశక్తి -యంత్రాంగం

తుపాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంటలను శుక్రవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు.

ఆనందపురం : ఆనందపురం మండలంలోని జగన్నాధపురం, కుసులువాడ, పొడుగుపాలెం, వెళ్లంకి గ్రామాల్లో వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, మండల వ్యవసాయాధికారి సిహెచ్.సంధ్య రత్న ప్రభ సందర్శించారు. మండలంలో సుమారుగా 35 ఎకరాలు వరి పంట కోత కోసి పొలంలో ఉందని, సుమారు 175 ఎకరాలు వరి పంటను కోత కోయకుండా వాయిదా వేసుకున్నారని వ్యవసాయాధికారులు తెలిపారు. పొలాల్లో నీరు నిలబడితే వెంటనే బయటికి పంపేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు తగ్గగానే ధాన్యం మొలకెత్తకుండా 2 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలు తడిచేటట్లు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. 2 శాతం ఉప్పు ద్రావణం అనగా ఒక లీటర్ నీటిలో 20 గ్రాములు గడ్డ ఉప్పు చొప్పున కలిపి పిచికారీ చెయ్యాలని చెప్పారు. నేలకు పడిపోయిన వరి పంటలో వెంటనే



నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పాయలు తీసి పక్క పక్క ఉన్న దుబ్బులను కలిపి కట్టలుగా కట్టి నిలబెట్టాలని రైతులకు సూచించారు.

పద్మనాభం : మండలంలోని అయినాడ, బిఆర్.తాళ్లవలస, కోరాడ, పాండ్రంగి తదితర గ్రామాల్లో గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఎడిఎ బి.విజయప్రసాద్ పర్యటించారు. అయినాడ, పాండ్రంగి గ్రామాల్లో కొంతమంది రైతులు వరి కోత కోయకుండా ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 22వ తేదీ వరకు వర్ష ప్రభావం ఉంటుందని, అంతవరకు కోతలు కోయకుండా ఆపాలని రైతులకు సూచించారు.

మాడుగుల : అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిచిన వరి పనలపై వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి.ఎం వాసుదేవరావు అన్నారు. శుక్రవారం మండలంలో వీరనారాయణం, సత్యవరం గ్రామాలలో పర్యటించి తడిచిన వరి పనలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో 80శాతం వరికోతలు పూర్తయ్యాయని, మిగిలిన వరి కోతలకు వర్షాలతో అంతరాయం ఏర్పడిందన్నారు. తడిసిన పనలపై ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తే, గింజలు మొలకెత్తకుండా ఉండడంతో పాటు ధాన్యం నాణ్యత చెడదన్నారు. రైతులు గమనించి తగు చర్యలు చేపట్టాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.వరప్రసాద్, స్థానిక నాయకులు జెర్రిపోతుల సూర్యనారాయణ పాల్గొన్నారు.



గుంతలతో కూడిన రోడ్డు ఇదే...

చెరువును తలపిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం మజ్జిపేటకు వెళ్లే మార్గంలో ఉన్న రోడ్డు ప్రస్తుత వర్షాలకు చిన్న పాటి చెరువును తలపించేలా ఉంది. పద్మనాభం మండలం ఆర్.వి.పురం నుంచి భీమిలి మండలం మజ్జిపేటకు వెళ్ళే మార్గంలో అడుగడుగున పెద్ద గుంతలతో రోడ్డు ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఆయా గుంతల్లో వర్షపు నీరు చేరింది. ఆటో, ద్విచక్ర వాహనాలు, లారీలు రాక పోకలు సాగించే సమయంలో అటు వైపుగా నడిచే వారిపై బురద తుళ్లి అసౌకర్యానికి గురవుతున్నారు. ఆ రోడ్డుపై ఆటో, ద్విచక్ర వాహనంపై ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును పునర్నిర్మించాలని లేదా మరమ్మతు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులను వాయిదా వేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆరిలోవ : అనకాపల్లి జిల్లా సబ్బవరంలో దామోదర సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు ఉపాధ్యాయులకు నిర్వహించనున్న శిక్షణా తరగతులను క్రిస్మస్ పర్వదినం కారణంగా వాయిదా వేయాలని యుటిఎఫ్ కోరింది. ఈమేరకు యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ ఆధ్వర్యాన నాయకులు డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బి.జనార్ధన్, కె.రాంబాబు, మహ్మద్ రిజ్వాన్, టి.జగన్ ఉన్నారు.

చెరువులకు జల కళ

ప్రజాశక్తి -భీమునిపట్నం : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు చెరువులు జల కళ సంతరించు కున్నాయి. మజ్జిపేట, సింగన బంద, తాటితూరు తదితర చెరువులు వర్షపు నీటితో నిండి ఉన్నాయి.

ఆలోచనలు సృజనాత్మకంగా ఉండాలి : ముత్తంశెట్టి

ప్రజాశక్తి -తగరపువలస : ప్రతి విద్యార్థి సృజనాత్మకంగా ఆలోచించాలని స్థానిక అవంతి ఇంజినీరింగ్ విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజుల పాటు జరుగనున్న విద్యా, వైజ్ఞానిక వేడుకలను శుక్రవారం కళాశాలలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠ్యాంశాలకే పరిమితం గాకుండా, ప్రయోగాత్మక నైపుణ్యం అలవర్చుకుంటూనే శాస్త్రీయంగానూ ఆలోచనలు ఉండాలని చెప్పారు. నేడున్న పోటీ ప్రపంచంలో సాంకేతిక నైపుణ్యంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరమన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ట్రిపుల్ ఐటి (ఖరగ్‌పూర్) ఎమిరేట్స్ అండ్ పూర్వ ప్రొఫెసర్ ఆర్‌వి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ఉజ్వల భవిష్యత్‌ను ఎలా రూపొందించుకోవచ్చునో పలు ఉదాహరణలతో వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకోవాలని నొక్కి చెప్పారు. ఇన్ఫోసిస్ గ్రూప్ ప్రాజెక్ట్ మేనేజర్ నర్రా సురేష్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ఇన్ఫోసిస్‌లో ఉద్యోగ అవకాశాలు విస్తృత స్థాయిలో అందుబాటులో కి రానున్నాయని వివరించారు. వీటిని అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఇండియన్ సర్వీసుల సిఇఒ సాయి సతీష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభా పాటవాలు వెలికి తీయడానికి ఈ తరహా వైజ్ఞానిక వేడుకలు దోహద పడతాయన్నారు. కళాశాల



ట్విన్ సిలిండర్ పంప్' నమూనాను తిలకిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రొఫెసర్ రాజ్ కుమార్

ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, అవంతి పాలిటెక్నిక్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ జగదీష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల ఆడిటోరియంలో ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రదర్శించిన 102 నమూనాలు ఎంతగానో ఆలోచింప జేశాయి. వివిధ కళాశాలల నుంచి సుమారు మూడు వేల మంది విద్యార్థులు ప్రదర్శనలు తిలకించారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అతిథులు నమూనాలు తిలకించి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు.

అంబులెన్స్ సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : నగర పరిధిలో రోజూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో మృతుల సంఖ్యను తగ్గించడానికి వీలుగా అపోలో ఆసుపత్రి, సిటీ పోలీస్ ఆధ్వర్యాన అంబులెన్స్ సేవలను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి తక్షణమే చికిత్స అందకపోవడంతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మృతుల సంఖ్య తగ్గించడానికి వీలుగా విశాఖపట్నం సిటీ పోలీస్, అపోలో హాస్పిటల్ సహకారంతో విశాఖ సిటీ పోలీసు యూనిట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి తక్షణ వైద్యసేవలు అందించడానికి, ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ఆరిలోవ హెల్త్‌సిటీలో అపోలో హాస్పిటల్, రామ్‌నగర్ అపోలో, సెవెన్ హిల్స్, కేర్, మెడికవర్, కెజిహెచ్, గీతం, గాయత్రి, క్విన్స్ ఎన్ఆర్ఐ, అనీల్ నీరుకొండ, కిమ్స్ ఐకాన్, ఒమ్ని ఆర్కె, పినాకిల్, క్యూ వన్, పవన్ సాయి ట్రామా కేర్ సెంటర్లకు తీసుకెళ్లేందుకు 24 గంటలూ అందుబాటులో ఉండే అంబులెన్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అంబులెన్స్ సేవలకు టోల్ ఫ్రీ నెంబర్ 1066ను సంప్రదించాలని పేర్కొన్నారు. క్షతగాత్రులకు తక్షణ సాయం, వారి ప్రాణాలను కాపాడేందుకు కోరిన వెంటనే అపోలో ఆసుపత్రి యాజమాన్యం ముందుకొచ్చి అంబులెన్స్ సౌకర్యం కల్పించడంపై యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. మరిన్ని అంబులెన్స్ సర్వీసులు ప్రారంభించడానికి కార్పొరేట్ ఆసుపత్రులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అపోలో సిఇఒ రామచంద్ర, మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణ మాట్లాడుతూ అపోలో అంబులెన్స్ సర్వీసులో అత్యవసర చికిత్సకు సంబంధించిన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిసిపి ప్రవీణ్, ఎసిపి అన్నెపు నర్సింహమూర్తి, ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు, ట్రాఫిక్ సిఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెయిన్‌బోలో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీలోని రెయిన్ బో చిల్డ్రన్ ఆసుపత్రిలో ఎల్‌వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో కేవలం 33 వారాల కవల శిశువును కాపాడే శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. కేవలం 1.5 కిలోల బరువున్న శిశువుకు పుట్టుకతో వచ్చే గ్లకోమా, తీవ్రమైన గుండె సంబంధించిన ఇబ్బందిని గుర్తించారు. కేవలం 14 రోజుల వయసులో శిశువుకు పిడిఎ (పేటెంట్ డక్టస్ ఆర్టెరియోసస్) లిగేషన్ కార్డియాక్ సర్జరీ నిర్వహించారు. రెయిన్ బో హార్ట్ ఇనిస్టిట్యూట్ వైద్యులు డాక్టర్ చౌహాన్ అభినవ్ సింగ్, పీడియాట్రిక్ కార్డియోథోరాసిక్ సర్జన్ ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఎల్‌వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ దివ్య దంగేటి, డాక్టర్ శివాని కొడాలి 24 గంటల్లో శిశువు రెండు కళ్లకు గ్లకోమా శస్త్రచికిత్స నిర్వహించి శాశ్వత అంధత్వాన్ని నివారించడంలో సహాయ పడ్డారు. రెయిన్ బో చిల్డ్రన్ ఆసుపత్రి ఎన్ఐసియు బృందం డాక్టర్ మందుల ఫణి ప్రియ, కన్సల్టెంట్ డిఎం నియోనాటాలజిస్ట్ డాక్టర్ సతీష్ వాడపల్లి, డాక్టర్ బాల శ్రీలత పులి, ఇతర వైద్యులు కీలక పాత్ర పోషించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

నేరాలు ఘోరాలు

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని ఆనందపురం గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం బాటిళ్లను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బండారు అప్పలనాయుడుపై కేసు నమోదు చేశారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు కశింకోట హెడ్ కానిస్టేబుల్ తన సిబ్బందితో ఆనందపురం గ్రామానికి వెళ్లగా బండారు అప్పలనాయుడు అనే వ్యక్తి మద్యం బాటిల్ పట్టుకొని వెళ్తుండగా పట్టుకున్నారు.

దుర్గమ్మ గుడిలో చోరీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట దుర్గమ్మ గుడిలో గురువారం రాత్రి 10 గంటల నుండి శుక్రవారం ఉదయం 5గంటల మధ్యలో గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. దుర్గమ్మ గుడిలో అమ్మవారి మంగళసూత్రం తదితర సుమారు 2 తులాలు బంగారం ఆభరణాలు దొంగిలించారు. దీనిపై గుడి నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుచ్చయ్యపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

హత్య కేసులో యావజ్జీవ శిక్ష

ప్రజాశక్తి-లీగల్ : ఒక హత్య కేసులో గాజువాకకు చెందిన మామిడి తిరుపతిరావు, దాలి చిరంజీవికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గాజువాక జిల్లా 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి షణ్ముఖరావు శుక్రవారం తీర్పు చెప్పారు. మల్కాపురం పోలీసుస్టేషన్‌లో దాఖలు చేసిన కేసును బాధితుల తరపున విచారించిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాతా పావని కథనం ప్రకారం.... నేవీలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న సందీప్ బిస్వాస్‌కు డ్రైవర్‌గా మామిడి తిరుపతిరావు పనిచేసేవాడు. డ్రైవర్‌గా పనిచేస్తూనే నౌసేనా బాగ్‌లో ఫ్యాన్సీ బుక్‌షాప్‌ను నడుపుతుండేవాడు. ఈ విషయం తెలిసి సందీప్ ప్రశ్నించాడు. దీంతో తిరుపతి అతని బావ చిరంజీవి కలిసి సందీప్‌ను అతని కారులోనే హత్య చేసి 2011 సెప్టెంబర్ 30న నరవ సమీపంలోని కల్వర్టులో మృతదేహాన్ని విసిరారు. దాలి చిరంజీవి నేరం అంగీకరించడంతో వారిద్దరికీ కోర్టు జీవిత ఖైదు విధించింది.


పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని పాటిమీద శివారు తోటల్లో పేకాట శిబిరంపై పోలీసుల దాడి చేశారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుండి ఫోన్లు, నగదు స్వాధీనపరుచుకున్నట్లు సీఐ కుమారస్వామి,ఎస్ఐ సన్నిబాబు వెల్లడించారు. గురువారం రాత్రి పేకాట శిబిరంపై దాడి చేశామని, ఈ దాడుల్లో పేకాట రాయుళ్ల నుండి రూ.లక్ష 2 వేల 760, 8 సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు.

గొలుగొండ : గొలుగొండ మండలం ఎఎల్.పురం గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేపట్టినట్లు కృష్ణదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. పేకాడుతున్న నలుగురు వ్యక్తుల్ని పట్టుకుని, రూ.3,280 నగదును, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా, ఎక్కడైనా జూదమాడినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రాంగణ నియామకాల్లో 42 మంది ఎంపిక

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గిడిజాల సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం సెయింట్- గోబియన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 42 మందిని ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.2 లక్షల వార్షిక వేతనం ఉంటుందని కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ కార్తీక్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ అమరేంద్ర కుమార్, మెకానికల్ విభాగాధిపతి రాజేంద్రప్రసాద్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో 'సాయిగణపతి' యాజమాన్య ప్రతినిధులు



వర్షంలోనూ నిరసన దీక్షను కొనసాగిస్తున్న కార్మికులు

వర్షంలోనూ నిరసన దీక్ష

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎన్ఎడి సిజిఎం నిరంకుశ ధోరణిని విడనాడి సస్పెండ్ అయిన 36 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఆరుగురిపై పెట్టిన పోలీస్ కేసును ఉపసంహరించుకోవాలని ఎన్ఎడి సీఈ యూనియన్ చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం బోరున కురుస్తున్న వర్షంలోనూ కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీనివాస్ మాట్లాడుతూ, కష్టపడి కార్మికులు చేసిన పనికి ఓటీని ఎలా తగ్గించాలని ఆలోచిస్తున్నట్లు సీజీఎం చెప్పడం దుర్మార్గమన్నారు. ఒకపక్క రాత్రింబవళ్లు పనిచేసి నేవీకి కావలసిన యుద్ధ సామాగ్రిని అందించాల్సిన పరిస్థితిలోనే ఉద్యోగులు ఓవర్ టైం చేశారని చెబుతూనే కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న సీజీఎంపై కఠిన చర్యలు తీసుకోవాలని యూనియన్ అధ్యక్షులు పి నూకరాజు డిమాండ్‌చేశారు. జన జాగరణ ఆధ్వర్యాన ఆదివారం వంటావార్పు కార్యక్రమాలను రూపొందించామని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీజీఎంపై న్యాయవిచారణ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గీతంలో గణిత శాస్త్ర దినోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : భారతీయ గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజం 137వ జయంతి సందర్భంగా జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో శివ నాడార్ విశ్వవిద్యాలయం (ఢిల్లీ) గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎ.సత్యంనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రామానుజం గణిత శాస్త్రంలో చేసిన అపార కృషి ప్రపంచ వ్యాప్తంగా గణితాన్ని సరికొత్త దశలో నిలిపిందని తెలిపారు. కంప్యూటర్ సహ అంతరిక్ష శాస్త్రం వరకు అన్ని రంగాలలోను గణిత శాస్త్రం ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, గణిత శాస్త్ర విభాగాధిపతి, సదస్సు కన్వీనర్ డాక్టర్ వి.శిరీష, కో-ఆర్డినేటర్లు డాక్టర్ పి.ఫణిభూషణరావు, డాక్టర్ పి.విజయ్‌కుమార్, డాక్టర్ టి.శ్రీలక్ష్మి, డాక్టర్ ఎ.శ్రీధర్, పి.శ్రీహరికష్ణ పాల్గొన్నారు. నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 536 మంది విద్యార్థులకు గణిత శాస్త్రంపై క్విజ్‌పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.



గుడివాడ అప్పన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అబిమానులు

మిందిలో గుడివాడ అప్పన్న వర్ధంతి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 68వ వార్డు పరిధి మింది గ్రామంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే గుడివాడ అప్పన్న 46వ వర్ధంతిని నిర్వహించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, గుడివాడ అప్పన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుడివాడ అప్పల రామ్మూర్తి, గుడివాడ లతీష్, స్థానిక పెద్దలు గుడివాడ అభిమానులు పాల్గొని అప్పన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుడివాడ అప్పన్న సేవలను వక్తలు కొనియాడారు. గుడివాడ అప్పన్న పేరున ఏటా పేదలకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమం చేయనున్నట్లు తెలిపారు.

తీరంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాల్గో వార్డు పరిధి మంగమారిపేట, ఉప్పాడ తీరంతో పాటు భీమిలి తీరానికి ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు కొట్టుకొచ్చాయి. గురు, శుక్రవారాల్లో సుమారు 12కి పైగా తాబేళ్ల కళేబరాలు కొట్టుకు రావడంతో, సంబంధిత కళేబరాలను జివిఎంసి, ప్రజారోగ్య విభాగం అధికారుల పర్యవేక్షణలో తీరంలో పూడ్చి వేశారు.

తెలుగుదనానికి నిలువెత్తు నిదర్శనం చిన్నయసూరి

మంత్రి కందుల దుర్గేష్



మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగుతనానికి నిలువెత్తు నిదర్శనం పరవస్తు చిన్నయ్యసూరి అని రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక పౌర గ్రంథాలయంలో పరవస్తు చిన్నయసూరి జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీవేత్త డాక్టర్ పేరి రవికుమార్‌కు సాహిత్య పురస్కారాన్ని మంత్రి దుర్గేష్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మాతృభాషను ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా కాపాడుకోవాలని సూచించారు. ఉపాధి కోసం ఆంగ్ల భాషను నేర్చుకున్నా మాతృభాషను మరువకూడదని సూచించారు. వేడుకలకు అధ్యక్షత వహించిన రాష్ట్రపతి పురస్కార గ్రహీత, సాహితీవేత్త బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ, తెలుగు సాహిత్యానికి పూర్వ ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు ప్రాధాన్యతనిచ్చారని గుర్తు చేశారు. ఆత్మీయ అతిథి ఆచార్యులు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ, తెలుగు సాహిత్యంపై చిన్నయసూరి విశేష కృషిచేశారని, విద్యార్థులకు వాటిని అందించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఆర్‌విఆర్ ప్రాజెక్ట్స్ అధినేత ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సాహిత్యాలకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ జిఎం రాజమన్నార్ మాట్లాడుతూ, టెక్నాలజీని ఉపయోగించుకుని విలువైన పుస్తకాలను తెలుగులోకి అనువదించాలని సూచించారు.

చిన్నయసూరి పురస్కార గ్రహీత డాక్టర్ పేరి రవికుమార్ మాట్లాడుతూ, సూత్రం, వాక్యము వివరణ తెలుగు సాహిత్యంలో చిన్నయ్య సూరి ప్రవేశపెట్టారన్నారు. భాషకు ఒక పద్ధతి ఏర్పాటుచేసేదే వ్యాకరణం అన్నారు. వ్యాకరణం భాషలోని లోపాన్ని తెలియజేస్తుందని తెలిపారు. పదంలో ఒక అక్షరం మారడం వల్ల వచ్చే అర్థాల గురించి వివరించారు. నిర్వాహకులు పరవస్తు సూరి మాట్లాడుతూ, తెలుగు సాహిత్యానికి మరలా పూర్వ వైభవం వస్తుందన్నారు. పాఠశాల పిల్లలకు తెలుగు ప్రాథమిక విద్యగా ఉండాలని సూచించారు. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల రెండు తరాలకు తెలుగు దూరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, రచయితలు డివి.సూర్యారావు, మేడ మస్తాన్‌రెడ్డి, కార్పొరేటర్ సురేష్, సూరపనేని విజయ్‌కుమార్, సాహిత్య ప్రియులు, కేయూ తెలుగు విభాగం విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలను ఉపసంహరించాలి



కరపత్రాలను విడుదలచేస్తున్న వార్వానివాస్ ప్రతినిధులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆస్తి పన్ను, ట్రూఅప్ ఛార్జీలు, టోల్ ఛార్జీలు, ప్రవేశ రుసుములు తదితర పేర్లతో నగర ప్రజలపై వేస్తున్న భారాలను, ప్రజల ఆస్తులైన స్టేడియం, పార్కులను ప్రైవేటు వారి సొంతం చేస్తున్న నిర్ణయాలను ఉపసంహరించాలని వార్వా నివాస్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీతమ్మధారలోని సంస్థ కార్యాలయంలో కరపత్రం విడుదల చేశారు. వార్వానివాస్ అధ్యక్షులు ఎన్.ప్రకాష్, కార్యదర్శి బిబి.గణేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలపై భారాలు తగ్గుతాయని ఆశించామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చెత్త పన్ను రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయని చెప్పారు విలువ ఆధారిత ఆస్తిపన్నును 2021లో గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని, ప్రజలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారని, జివిఎంసి నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ 10 వేల మందికి పిటిషన్లు వేశారని గుర్తుచేశారు. ప్రజల అభిప్రాయాన్ని లెక్కచేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆ పన్నును అమలు చేసిందని, దీనివల్ల ఐదేళ్లకొకసారి పెరగాల్సిన ఇంటి పన్నులు ఏటా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఆస్తులు, నిర్మాణ విలువలు 10 నుంచి 20 శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం వల్ల కూడా ఆస్తి పన్ను పెరుగుతుందన్నారు. ప్రజాకంటకంగా మారిన ఈ పన్ను రద్దుచేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ట్రూ అప్, ఫ్యూయల్ సర్దుబాటు చార్జీల వల్ల విద్యుత్ బిల్లులు భారీగా పెరుగుతున్నాయని, ఇప్పుడు వాడే కరెంటుకు రెండుమూడు రెట్లు చార్జీలు కట్టాల్సి వస్తుందని, ఇది చాలా అన్యాయం అన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చంద్రబాబు ఎన్నికల్లో హామీ మేరకు వాటిని రద్దుచేయాలని కోరారు. బీచ్‌లో ప్రవేశ రుసుం పెట్టిందని, సింగిల్ ఎంట్రీ, ఇతర పద్ధతుల్లో పెంచుతున్న టోల్ ఛార్జీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. నగరంలోని ప్రజల ఆస్తులైన పార్కులు, స్పోర్ట్స్ స్టేడియాలను ప్రభుత్వమే నడపాలని, విశాఖ పోర్టు స్టేడియాన్ని విశ్వనాథ్ నుంచి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాలతో 10,000 కరపత్రాలను "వార్వా నివాస్" నగరంలో పంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై వార్వానివాస్ చేస్తున్న ఉద్యమానికి ప్రజానీకం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జివి.రమణ, మోహనరావు, ఆరిలోవ జోన్ నాయకులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్‌లో పాల్గొన్న అతిథులు

ఉమెన్స్ కాలేజీలో సెమీ క్రిస్మస్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర యూనివర్సిటీ ఉమెన్స్ కాలేజీ కెసి బ్లాక్ ఆడిటోరియంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ నాటికలు, డ్యాన్సులు తదితర కార్యక్రమాలు జరిపారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ అనిలా నాయర్ హాజరయ్యారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ, అసిస్టెంట్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.ప్రజ్ఞ, ఇసిఇ హెచ్ఒడి డాక్టర్ ఎస్.అరుణ, సివిల్ ఇంజినీరింగ్ హెచ్ఒడి డాక్టర్ జి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రజలు నష్టాలను చవిచూస్తున్నారు. పలుచోట్ల రక్షణ గోడలు, మెట్లు కూలిపోయాయి.

గాజువాక : పెదగంట్యాడ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఒక పాత ఇంట్లో శుక్రవారం మెట్లు నేలకూలాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి నష్టమూ జరగలేదు. జోనల్ కమిషనర్ శేషాద్రి, స్థానిక రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి ఇందిరానగర్, గోపాలపట్నం లక్ష్మీనగర్ కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడ కూలింది. పాక్షికంగా దెబ్బతిన్న కొండవాలు ప్రాంతాలను పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గణబాబు సందర్శించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కోతకు గురైన తీరం..



భీమిలి బోయి వీధి వద్ద కోతకు గురైన తీరం

భీమునిపట్నం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సముద్రంలో అలల తాకిడికి జివిఎంసి మూడో వార్డు బోయివీధి సామాజిక భవనం ఎదురుగా తీరం వెంబడి ఉన్న మట్టి గోడ కోతకు గురైంది. దీంతో ఒడ్డున నివాసాల్లో ఉన్న పలువురు మత్స్యకార కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. భారీ వర్షాలు కురిసి, సముద్రంలో అలల ఉధృతి పెరిగితే గోడ మరింతగా కోతకు గురయ్యే అవకాశం ఉందని పలువురు మత్స్యకారులు అంటున్నారు. కోతకు గురయ్యే ప్రాంతాన్ని మత్స్యకార నాయకులు గంటా నూకరాజు శుక్ర వారం పరిశీలించారు. తీరం కోతకు గురి గాకుండా శాశ్వత రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని, తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

ఇటుక తయారీ నిలుపుదల

పద్మనాభం : మండలంలోని మద్ది, పాండ్రంగి, బోని, పద్మనాభం, వికె.పాలెం గ్రామాల్లో వారం రోజులుగా ఇటుకల తయారీని నిలుపుదల చేశారు. ఇప్పటికే తయారుచేసిన ఇటుకులపై టార్పాలిన్లను కప్పారు. రెడ్డిపల్లి, దూపేట, సుంకర పేట, కోరాడ, గద్దపేట గ్రామాల్లో కేబేజీ పంట పూర్తిగా నష్టపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప, దొండ, మొక్కజొన్న పంటలు కూడా నష్టపోయినట్లు రైతులు చెబుతున్నారు.



ఇటుకలపై కప్పి ఉంచిన టార్పాలిన్లు

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ వావా

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామపంచాయతీలు, పాఠశాలలలో పనిచేసే సఫాయి కర్మచారి (పారిశుధ్య కార్మికులు)లకు కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనం అందించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పి.వావా అన్నారు. స్థానిక ఎస్ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం సంబంధిత అధికారులతో వావా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సఫాయి కర్మచారిలకు ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని, వారికి షూరిటీ లేకుండా బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పశువులు, కోళ్ల తదితర పెంపకం యూనిట్లు మంజూరు, సేవా రంగంలోనూ అనేక అవకాశాలను కల్పించవచ్చని పేర్కొన్నారు. జాతీయ సఫాయి కర్మచారి ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. విధి నిర్వహణలో మరణిస్తే తక్షణం కుటుంబ సభ్యులకు ఉద్యోగాన్ని కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, వారికి ఇళ్లు మంజూరు చేయాలని, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు అందించాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని కమిషను దృష్టికి తీసుకురాగా వారికి కార్మికశాఖ చట్టాల ప్రకారం వేతనాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని, కార్మికశాఖ డిప్యూటీ కమిషనరును ఆదేశించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న ప్రయోజనాలు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి కె.రాజేశ్వరి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి, జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావు నాయుడు, లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.సత్యనారాయణ, కార్మికశాఖ డిప్యూటీ కమీషనరు కె.వసంతరావు, నర్సీపట్నం, యలమంచిలి, మున్సిపల్ కమిషనర్లు, జివియంసి జోనల్ అధికారులు శాఖల వారీగా పారిశుధ్య కార్మికులకు అందిస్తున్న ప్రయోజనాలు, సేవలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు, సంఘ ప్రతినిధులు, సఫాయి కర్మచారిలు పాల్గొన్నారు.

వావాను కలిసిన కలెక్టర్

జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పి.వావాను కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించారు.



మాట్లాడుతున్న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ వావా



డాక్టర్ వావాను కలిసిన కలెక్టర్ విజయ కృష్ణన్

నేడు పినకోటకు పవన్ కల్యాణ్ రాక

కాశీపురం వద్ద భారీ స్వాగత ఏర్పాట్లు

ప్రజాశక్తి-దేవరాపల్లి



మారుమూల గిరిజన ప్రాంతం పినకోటలో పంచాయతీలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ శనివారం పర్యటించనున్నారు. దేవరాపల్లి నుంచి రోడ్డు మార్గంగా పినకోట పంచాయతీకి వెళ్లి పలు గ్రామాల రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని మండల జనసేన అధ్యక్షులు గొర్రుపోటు రామ్మూర్తి నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని కాశీపురం గ్రామంలో భారీగా స్వాగత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాడుగుల నియోజకవర్గంలోని ఎన్డీఏ కూటమి నేతలు, నాయకులు, కార్యకర్తలు, జనసేన అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

జ్ఞాన యోగాను అభ్యసించాలి

ప్రజాశక్తి-చోడవరం

అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరు జ్ఞాన యోగాను అభ్యసించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ యోగ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ పుల్లేటి సతీష్ కోరారు. వయసుతో తారతమ్యం లేకుండా యోగాను అభ్యసించినట్లయితే శారీరక రుగ్మతలు తొలగడంతో పాటు అనేక వ్యాధులకు దూరమవుతామని తెలిపారు. ప్రతిరోజు ఉదయం పూట సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మారుతున్న కాల పరిస్థితుల్లో వివిధ రోగాలకు బలవుతూ జీవితాన్ని ఆనందంగా గడపలేని పరిస్థితి ఏర్పడిందని, యోగా వల్ల శరీరం సౌష్టం, మానసిక పరిస్థితి చక్కగా ఉంటాయని చెప్పారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-చోడవరం

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని నరసాపురం కస్తూరిబా పాఠశాల విద్యార్థినులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి చోడవరం ఏపీఈపీడీసీఎల్ డిఇఇ యు.కుమార్ గౌరీప్రసాద్ చేతుల మీదుగా శుక్రవారం బహుమతులు అందజేశారు. ఇంధన పొదుపు భావితరాలకు మదుపు అని ఆయన విద్యార్థులకు వివరించారు. డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన ఏ సుప్రజ, ఎస్.జాహ్నవి, ఎస్.సుమిత్ర, డ్రాయింగ్‌లో కే యామిని, ఎస్ శృతిక, జి హేమ సుందరి విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వై యశోద, రూరల్ ఏఈ లైన్ ఇన్స్పెక్టర్ తాతబాబు, లైన్‌మెన్ యుగంధర్ పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ఎంఎస్ఎంఇల ప్రతినిధులు

ఎన్‌టిపిసిలో వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి-పరవాడ

ఎన్టిపిసి సింహాద్రి ఎంఎస్ఎంఇ విక్రేతల కోసం స్పెషల్ వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్-2024 గురువారం శకుంతలం ఆడిటోరియంలో నిర్వహించారు. ప్రభుత్వ విధానాలు, సేకరణ ప్రక్రియలపై విలువైన అంతర దృష్టితో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సాధికారతను ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుందని ఎన్టిపిసి అధికారులు తెలిపారు. సీనియర్ సిజిఎం సిపిజి -3 చొరవతో విశాఖపట్నం, హైదరాబాద్ నుండి అనేక మంది ఎంఎస్ఎంఇ విక్రేతలను ఒకచోట చేర్చి, ఎస్సి, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డిఎఫ్ఓ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి జంగం, సమీర్ శర్మ, ఎన్టిపిసి సింహాద్రి సీజీఎం, ప్రాజెక్ట్ హెడ్, రష్మి రంజన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డులు పొందిన

సర్పంచ్‌లు, అధికారులకు సిఎం అభినందనలు



సర్పంచ్, అధికారులను అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి, నక్కపల్లి

భారత రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ పంచాయతీ అవార్డులు (దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ శతత్ వికాస్ పురస్కారం-2024) పొందిన సర్పంచులు, అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ మేరకు అమరావతి సెక్రటేరియట్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో అవార్డులు పొందిన నక్కపల్లి మండలం న్యాయంపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ రెడ్డి వరహాలుబాబు, అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ యాదగిరి అప్పారావును నక్కపల్లి ఎంపీడీవో డి సీతారామరాజు, జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి తదితరులు ముఖ్య మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలో అందుకున్న పురస్కారాలను, ప్రశంసా పత్రాలను చంద్రబాబుకు చూపించారు. ఈ సందర్భంగా వారి చంద్రబాబు అభినందించారు. గ్రామీణాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేసి గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నక్కపల్లి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఉపమాక వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

తడిసి ముద్దయిన వరి పనలు

తీవ్రంగా నష్టపోతున్న రైతులు



తడిసిన వరి పనలను చూపుతున్న బాధిత రైతు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట, వడ్డాది

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లోని కోసి ఆరబెట్టిన వరి పనలు తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులకు తీవ్రంగా వాటిల్లనుంది. బుచ్చయ్యపేట మండలంలోని వడ్డాది, కస్వా, లోపూడి, చిన్నపన్నపాలెం, పోలేపల్లి, దిబ్బిడి, రాజాం, కందిపూడి తదితర గ్రామాలలో వందలాది ఎకరాల్లో కోత కోసిన వరి పంట మడులో ఉంది. రాత్రి నుండి వర్షం ఏమాత్రం తెలిపినవ్వకుండా కురవడంతో వరి పనలను ఆరబెట్టుకొనే అవకాశం లేకుండా పోయింది. వర్షాలకు మడుల్లో నీరు చేరడంతో వరి పనలు తడిసి పోయి మొలకలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన వరి పనలను చూసి అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. నీటిలో పంట ఆరబెట్టడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షాలతో నేలపాలైందని లబోదిబోమంటున్నారు.

లబోదిబోమంటున్న రైతులు

అనకాపల్లి : ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వస్తుందన్న తరుణంలో తుఫాను రూపంలో తమను కబలిస్తోందని రైతులు లబోదిబోమంటున్నారు. మూడు రోజుల్లో కురుస్తున్న వర్షాలకు అనేక మండలాల్లో వరి పంట తడిసింది. తుఫానుకు ముందు కోసిన వరిచేలు ఇంచుమించుగా కుప్పలు పెట్టకపోవడంతో నీటి పాలయ్యాయి. గత మూడు రోజులుగా జిల్లాలో 680 మీటర్ల వర్షపాతం, సగటున ప్రతి మండలంలో 28.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఈనెల 19న 141.9 మిల్లీమీటర్లు, 20వ తేదీ ఉదయానికి 341, సాయంత్రం ఐదున్నర గంటలకు 197.4 మిల్లీమీటర్లు నమోదైంది. కోసిన వరి పంట కుప్పలుగా పెట్టకపోవడంతో నష్టపోతున్నట్లు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లితోంది. దీనిపై ప్రభుత్వం సర్వే నిర్వహించి నష్టపరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.



వరి కోత కోసిన మడిలో నీరు నిల్వ ఉన్న దృశ్యం



పట్టుబడిన నిందితుడు, సారాతో ఎక్సైజ్ అధికారులు

సారా బట్టీలపై దాడి

- 20 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాలు మేరకు అనకాపల్లి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, సిబ్బంది నాటు సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. అనకాపల్లి మండలం, వల్లూరు గ్రామ శివారున గౌరమ్మ గడ్డ కాలువ దగ్గర అక్రమంగా నాటు సారా తయారు చేస్తున్న బట్టీలపై దాడి చేసే 20 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఎర్ర నాగరాజు అనే వ్యక్తి వద్ద నుంచి 15 లీటర్ల నాటు సారాను, సారా తయారీ చేసే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నాగరాజును అరెస్టు చేసి, కేసు రిజిస్ట్రేషన్ చేసి అనకాపల్లి కోర్టులో హాజరుపర్చగా కోర్టు అతనికి 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించినట్లు చెప్పారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వై.లక్ష్మన్నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై ఎస్ఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి- యలమంచిలి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన ఎలమంచిలిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అభి మాట్లాడుతూ పార్లమెంట్లో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా 'అంబేద్కర్ అంబేద్కర్ అనడం' ప్రతి ఒక్కరికీ ఫ్యాషన్ అయిపోయిందని, కనీసం దేవుని స్మరిస్తే పుణ్యం వస్తుందని వ్యాఖ్యానించడాన్ని తీవ్ర ఖండించారు. దీనిపై అమిత్ షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మతోన్మాద భావజాలం బయటపడిందన్నారు. పేదలు, కార్మికులు, మహిళలకు, దళిత, గిరిజన, మైనార్టీ, బిసిలకు హక్కులు కల్పించిన మహెూన్నత వ్యక్తి డాక్టర్ అంబేద్కర్ దేవుడి కంటే ఎక్కువ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పాయకరావుపేట డివిజన్ కమిటీ సభ్యులు గణేష్, లక్ష్మణ్, రాజేష్, సింహాద్రి, శివ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : పార్లమెంట్ సమావేశాల్లోనే అంబేద్కర్‌ను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను తక్షణమే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పాయకరావుపేటలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కృపానంద, పాయకరావుపేట డివిజన్ కమిటీ సభ్యులు రాము, భార్గవ్, వరుణ్, ధనుంజయ్, రాము పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి : సిఐటియు

పరవాడ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా తక్కువ చేసి మాట్లాడిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత పట్ల బిజెపి దుర్మార్గ వైఖరిని ఆయన ఖండించారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి బిజెపి కంకణం కట్టుకుందని మండిపడ్డారు. అంబేద్కర్ ఆలోచన విధానాన్ని సమర్థించేవారు బిజెపి విధానాలను వ్యతిరేకించాలని కోరారు.



నక్కపల్లిలో ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉపాధి హామీ కూలీలకు

200 పని దినాలు కల్పించాలి

ప్రజాశక్తి- మునగపాక

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 200 పని దినాలు కల్పించాలని సిఐటియు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆళ్ళ మహేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ తదితరులు డ్వామా పీడీకి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు వారాల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పని ప్రదేశంలో టెంట్లు, మంచినీళ్ళ, మజ్జిగ సరఫరా, మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీ రోజుకు రోజు కూలి రూ.600 పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామస్థాయిలో సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన అంశాలపై మరింత లోతుగా ఆడిట్ నిర్వహించి అవినీతి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు, వ్యకాస నేతలు

రామలింగస్వామి అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కొణతాల రామలింగ స్వామి అవార్డుల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని డాక్టర్ కొణతాల రామలింగ స్వామి మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకురాలు కొణతాల లక్ష్మీపార్వతి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కీర్తిశేషులు డాక్టర్ కొణతాల రామలింగస్వామి ఆశయాలను, సేవా దృక్పథాలను కొనసాగిస్తూ, సమాజ హితం కోసం, నిస్వార్ధంగా సేవ చేసే వారికి తమ ట్రస్టు ద్వారా 2025 సంవత్సరం భోగి పండుగ రోజున అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ సమాజ సంఘ సేవకులను, ఉత్తమ ఉపాధ్యాయుడు, ఉత్తమ విద్యార్థిలను మొత్తం ఆరుగురుని 'డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కార్' ప్రతిష్టాత్మక అవార్డులను ప్రదానం చేస్తున్నామని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి ఔత్సాహికులు దరఖాస్తులను 'డాక్టర్ కొణతాల రామలింగ స్వామి మెమోరియల్ ట్రస్ట్, డోర్ నెంబర్ 12-118, చిన్ని బాబు కాలనీ, తిలక్ మార్గ్, తుమ్మపాల పంచాయితీ, అనకాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్-531032 అనే అడ్రస్‌కు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9246642308 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. ఈ అవార్డులు ఎంపిక విషయంలో తుది నిర్ణయం ట్రస్టు నిర్వాహకులుదేనని, ఎంపిక కాబడిన అవార్డు గ్రహీతల వివరాలు త్వరలోనే పత్రికల ద్వారా తెలియజేస్తామని తెలిపారు. తమ ట్రస్ట్ ద్వారా 2021 సంవత్సరం నుండి పలు సంఘ సేవ కార్యక్రమాలు చేపట్టి అందరి అభిమానాన్ని పొందుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మల్ల జగదీష్, కొణతాల ఉమామహేశ్వరరావు, మల్ల శైలజ, ప్రణయ సూర్య, నైమిష, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల పణి భూషణ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పట్ట పగలు వెలుగుతున్న వీధి లైట్లు

ప్రజాశక్తి-కె.కెటపాడు

మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలు వీధి లైట్లు వెలుగుతున్నాయి. అయినా సంబంధిత పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని చౌడువాడ, గుల్లేపల్లి గ్రామాలలో ప్రతినిత్యం వీధిలైట్లు వెలుగుతూనే ఉంటాయి. గుల్లేపల్లి గ్రామంలో గడ్డ నుంచి చెరుకుతూరు కేంద్రం వరకు గల మెయిన్ రోడ్డు గుండా లైట్లు వెలుగుతున్నాయి. గ్రామంలో మరిడిమాంబ ఆలయ సమీపాన ఉన్న ఒక స్తంభానికి రెండు లైట్లు కట్టి ఉన్నాయి. విద్యుత్తు ఆదాకు ప్రతి ఒక్కరూ ఎల్ఈడి బల్బులు వాడాలని విద్యుత్ అధికారులు ప్రచారం చేశారు. విద్యుత్ పొదుపుపై అవగాహనకు వారోత్సవాలు నిర్వహించారు. కాని ఇలా వీధి లైట్లు ప్రతి నిత్యం వెలుగుతూ ఉంటే విద్యుత్ ఆదా ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు విద్యుత్ అవసరాలకు తగ్గట్టు లేకపోవడంతో కొన్ని రోజుల్లో రాత్రి ఏడు గంటల వరకు విద్యుత్తు నిలుపుదల చేస్తున్నారు. దీంతో పొలం పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన గృహిణులు వంట చేసుకున్నందుకు అనేక ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు అవసరం లేకుండా పట్టపగలు వీధి లైట్లు వెలుగుతున్నా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టపగలు వీధిలైట్లు వెలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పగలు వీధి లైట్లు వెలుగుతున్న దృశ్యం

పశు వ్యాధుల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి

కాలానుగుణంగా పశువులకు వచ్చే వ్యాధులను నియంత్రించేందుకు జిల్లా పశుసంవర్ధక శాఖ సమర్ధవంతమైన చర్యలను చేపడుతున్నట్టు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహన్రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 -25 ఆర్థిక సంవత్సరం నాలుగవ త్రైమాసికంలో అందించే వైద్య సేవలు గురించి ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలోని అన్ని పశు వైద్యశాలలకు సుమారు రెండు కోట్ల రూపాయల మందులను అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. పశువుల మందులు టీకాల వినియోగంలో పారదర్శకత, కచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. 2024 డిసెంబర్లో గొంతువాపు వ్యాధి నివారణకు జిల్లాలో అన్ని మండలాల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న గేదెలు ఆవులకు టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. 2025 జనవరిలో ఉచిత నట్టల నివారణ మందులు పంపిణీ గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు దూడలకు, గొర్రెలు మేకల్లో మసూచి వ్యాధి టీకాలు, ఫిబ్రవరి మాసంలో కోళ్లలో వ్యాపించే కొక్కెర తెగులు, మసూచి వ్యాధి నివారణ టీకాలు, మార్చి నెలలో గేదెలు ఆవులు పందులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందని వెల్లడించారు. ఆయా నెలలో పెంపకదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అవార్డు అందుకుంటున్న ఎన్‌టిపిసి అధికారులు

ఎనర్జీ కన్జర్వేషన్ ఎక్సలెన్స్‌లో

ఎన్‌టిపిసి సింహాద్రికి అవార్డు

ప్రజాశక్తి-పరవాడ : థర్మల్ పవర్ ప్లాంట్ సెక్టార్‌లో ఎనర్జీ కన్జర్వేషన్, ఎనర్జీ ఎఫిషియన్సీలో ఆదర్శప్రాయమైన విజయాలు సాధించినందుకు గాను ఇంధన సంరక్షణ మిషన్ (ఏపీఎస్ఇసీఎం) ఎపి ప్రభుత్వ ఇంధన శాఖ ద్వారా ఎన్‌టిపిసి సింహాద్రికి ప్రతిష్టాత్మక సిల్వర్ కేటగిరీ 2024 అవార్డుతో సత్కరించింది. ఏజీఎం ఇఇఎమ్‌జి నవీన్ కిషోర్, ఎన్టిపిసి సింహాద్రి తరపున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ నుండి అవార్డును అందుకున్నారు. ఎన్‌టిపిసి సింహాద్రికి స్థిరమైన ఇంధన పద్ధతులు, కార్యాచరణ శ్రేష్టత పట్ల ఉన్న తిరుగులేని నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో శనివారం కసింకోట సబ్ డివిజన్ పరిధిలో అనకాపల్లి మండలం కొత్తూరు సబ్ స్టేషన్‌లో విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని సిజిఆర్ఎఫ్ కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిజిఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్ మసిలమని, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్లో శుక్రవారం మాదకద్రవ్యాలపైనా, రహదారి భద్రత, సైబర్ నేరాలపై సంకల్ప అనే కార్యక్రమం నిర్వహించారు. పరవాడ సిఐ ఆర్.మల్లికార్జునరావు సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి, లైసెన్స్ లేని వారు మోటర్ బైక్‌లు నడిపితే ఎంతటి నేరమో, మాదకద్రవ్యలకు ఎలా బానిసలు అయిపోతున్నారో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ సీతాలక్ష్మి, సీఈఓ కె. నిశాంత్, పరవాడ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ మల్లికార్జునరావు

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి


రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి మోహన్

ప్రజాశక్తి -కోటవురట్ల: వివిధ సమస్యలపై అందిన ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలని నర్సీపట్నం డిఎస్‌పి మోహన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషనును ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు పెండింగ్ కేసు వివరాలు, వాటి పురోగతి అడిగి తెలుసుకున్నారు, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వాహనదారులు హెల్మెట్ ధరించే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు, అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు, కార్యక్రమంలో సిఐ రామకృష్ణ, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

ఆంధ్ర ఖోఖో జట్టు కెప్టెన్‌గా గురుకుల విద్యార్థి



ప్రజాశక్తి-దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి గురుకుల పాఠశాల విద్యార్థి గాలి అజయ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అండర్-17 ఖోఖో జట్టుకి కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అజయ్ సారథ్యంలో 12 మంది సభ్యులతో కూడిన జట్టు ఈ నెల 21 నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఆడనుంది. శనివారం నుంచి జరగనున్న ఈ పోటీలకు రెండు రోజుల ముందే ఆంధ్రా జట్టు అయోధ్యకు చేరుకుంది. జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో తప్పని సరిగా విజయం సాధించి తీరుతారని సాంఘిక సంక్షేమ గురుకులాల ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయాధికారిణి రూపావతి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తమ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థి అజయ్ రాష్ట్ర ఖోఖో జట్టుకి నాయకత్వం వహించడం ఎంతో గర్వకారణంగా ఉందంటూ ప్రిన్సిపాల్ రఘు, వ్యాయామ ఉపాధ్యాయుడు తరుణ్ పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

● 38 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో కళాశాల ప్రిన్సిపల్ సివిఎస్ఎస్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగమేళాలో నక్కపల్లి . హైడ్రో ల్యాబ్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగమేళాలో 52 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా, ఆయా సంస్థలు రాత పరీక్షలు, మౌఖిక పరీక్షలు నిర్వహించి 38 మందిని ఎంపిక చేయగా, ఉద్యోగ నియామక పత్రాలను కళాశాల ప్రిన్సిపల్ శాస్త్రి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో చదువుతున్న విద్యార్థులకు సైతం ఉద్యోగ అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని, విద్యార్థులు తగిన నైపుణ్యం అభివృద్ధి చేసుకొని వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైడ్రో కంపెనీ హెచ్ ఆర్ రాజేష్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ హెచ్ఆర్ ప్రశాంత్, స్కిల్ హబ్ ఇంచార్జ్ లక్ష్మయ్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి జయలక్ష్మి, ఉపాధ్యాయులు షర్మిల శ్రీ, అప్పలనాయుడు, బి రాజు, ఎం రాంకుమార్, ఆర్ ప్రసాదరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ శాస్త్రి

గణితంపై ఆసక్తిని పెంచుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: విద్యార్థులు గణితం పై ఆసక్తి పెంపొందించుకోవాలని చెన్నై మ్యాథమెటికల్ ఇనిస్టిట్యూట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మద్దాల సుందరి అన్నారు. శుక్రవారం పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలైన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని ఇన్ఫినిటమ్ పేరిట నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు. గణిత అప్లికేషన్స్‌ను ఆస్ట్రో ఫిజిక్స్ ఓరిగామిలోకి ఎలా ఉపయోగించబడుతుందో వివరించారు.. సైన్స్ అండ్ టెక్నాలజీలో గణితం పరిధిని వివరించి, గణితం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని మరింత పెంపొందించారు. పేపర్ మడతపెట్టే విధానం (ఓరిగామి) లాగానే సోలార్ ప్యానెల్స్‌ని వివిధ ఆకారాలలో మడతపెట్టి అంతరిక్షంలోకి పంపించే ఆకతులను తయారు చేస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ గణిత విద్య, పరిశోధన సంఘం అధ్యక్షులు, గణితశాస్త్ర సృజనాత్మకత సంఘం ఇంటర్నేషనల్ సభ్యులు ప్రొఫెసర్ ఎస్ఆర్. సంతానం మాట్లాడుతూ దైనందిన జీవితంలో గణితం ఒక భాగమని, చిన్న వయస్సు నుండి లెక్కలలో ప్రతిభ ఆధారంగా అంచనా వేయడం మనకు అలవాటేన్నట్లు. గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ 15 ఏళ్లకే భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురేశారన్నారు. నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శివయ్య మాట్లాడుతూ విద్యార్థులు గణితంలో పరిశోధన చేస్తే ఉన్నత స్థానాలకు చేరుకొనే అవకాశం ఉందన్నారు.నిజ జీవితంలో గణితశాస్త్ర అనువర్తనాలు, శాస్త్ర సాంకేతిక రంగాలలో పెరుగుతున్న గణితశాస్త్ర పాత్రను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో విజేతలకు మొదటి బహుమతిగా రూ. 6 వేలు,ద్వితీయ బహుమతిగా రూ.3 వేలతోపాటు జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. రామకృష్ణారెడ్డి , ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పెనుగొండ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రొఫెసర్లు

టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు


టెస్ట్ పేపర్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- నక్కపల్లి : పాయకరావుపేట మండలం ఎస్ నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992-93 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు పూర్వ విద్యార్థులు దేవవరపు రఘు, తేజోమూర్తుల కృష్ణశర్మ, మేడిశెట్టి పెంటయ్య, కొర్రా రాధారాణిల రూ.10 వేల ఆర్థిక సహాయంతో 125 మంది 10వ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ముద్రించిన మోడల్ టెస్ట్ పేపర్లను శుక్రవారం ఉచితంగా అందజేశారు విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవవరపు శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాలివెంకట గోవిందరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మాసా ఈశ్వరరావు, పూర్వ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు టన్నుల గోమాంసం స్వాధీనం

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వేంపాడు జాతీయ రహదారిపై ఒక కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న గోమాంసాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు వేంపాడు జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా కంటైనర్‌లో అక్రమంగా గోమాంసం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. సుమారుగా 5 టన్నులు గోమాంసాన్ని విజయనగరం జిల్లా,సొంతపాలెం నుండి రాజమండ్రి వైపు అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. కంటైనర్ డ్రైవర్ మణికంఠతో మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గోమాంసాన్ని పూడ్చిపెట్టినట్లు తెలిపారు.

మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా సుజాత

ప్రజాశక్తి-గొలుగొండ : వైసిపి మహిళా విభాగం అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలిగా ఎ.ఎల్.పురం సర్పంచ్ లోచల సుజాత నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.సుజాత ఇప్పటివరకు అనకాపల్లి జిల్లా ఎస్‌సి సెల్ మహిళా అధ్యక్షురాలుగా ఉన్నారు.

వాలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షులుగా శాంతారామ్

ప్రజాశక్తి-గొలుగొండ : వైసిపి వాలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షులుగా గొలుగొండ మండలం గుండుపాల మాజీ ఎంపిటిసి, సీనియర్ నాయకులు కొరుప్రోలు ఫణి శాంతారామ్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నూతన నియామకాలలో శాంతారామ్‌కు ఈ పదవిని ఇచ్చారు.

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు


ఉపవరంలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ జనార్ధన్

ప్రజాశక్తి- కోటవురట్ల : మండలంలోని గొట్టువాడ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ తిరుమలబాబు పాల్గొని, వివిధ సమస్యలపై 20 ఫిర్యాదులు స్వీకరించారు. ఇంతవరకు 9 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 320 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 68 పరిష్కరించామన్నారు. రీ సర్వే గ్రామసభల్లో వచ్చిన ఫిర్యాదులే పునరావృతమౌతు న్నాయన్నారు. ఇటీవల నిర్వహించిన రీసర్వే గ్రామ సభలో 802 ఫిర్యాదులు అందగా 328 పరిష్కరించినట్లు తెలిపారు, నక్కపల్లిలో హోం మంత్రి అనిత నిర్వహించిన ప్రజా దర్బారులో 21 ఫిర్యాదులు అందగా 3 పరిష్కరించామన్నారు కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్, ఆర్ఐ ఊర్ధవరావు గ్రామ సర్పంచ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : భూ సమస్యలు పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం అని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర అన్నారు. మండలంలోని శంకరం గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఏ సమస్య వచ్చినా రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల తహశీల్దారు విజయ్ కుమార్, ఆర్ఐ రమేష్, మహిళ ఎస్సై మణికుమారి, వీఆర్వో అప్పలరాజు, ప్రెసిడెంట్ రామకృష్ణ, సన్యాసిరావు, పవన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని ఉప్పవరం గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దారు జివి జనార్ధన్ రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు, జనసేన అధ్యక్షులు చిన్ని దొరబాబు, ఎం జగన్నాధపురం గ్రామ మాజీ సర్పంచ్ భీమిని వెంకటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ అడపా మహాలక్ష్మి నాయుడు, నీటి సంఘం ఉపాధ్యక్షులు కాయల వసంతరావు, విఆర్ఓ జగన్నాధరావు పాల్గొన్నారు.

రోలుగుంట : మండలంలోని ఎంకె.పట్నం గ్రామంలో రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ నాగమ్మ పాల్గొని, రైతుల నుంచి భూసమస్యలపై అర్జీలను స్వీకరిం చారు. సదస్సులో మొత్తం 15 అర్జీలు వచ్చాయని, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరిస్తామని తహశీల్దార్ తెలిపారు.డిటి శంకర్, విఆర్ఓ రాజులమ్మ పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం పాలవలస గ్రామపంచాయతీలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ గోవిందరావు ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సుకు రైతులు ఫిర్యాదులు అందించారు. రీ సర్వేలో ముఖ్యంగా కొలతల్లో తేడాలు ఉన్నట్లు రైతులు సదస్సు దృష్టికి తీసుకెళ్లారు. అవకాశం ఉన్న మేరకు సమస్యలను పరిష్కరిస్తామని డిటి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగోతి అచ్చియ్యమ్మ, ఎంపిటిసి సభ్యులు రౌతు శ్యామల వెంకట్రావు, జనసేన మండల ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, భీమిలి వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రౌతు శ్రీను, నాగోతి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పి.భీమవరం, కొండెంపూడి గ్రామల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహశీల్దార్ ఎం లక్ష్మీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, వీఆర్వోల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఈర్లే శ్రీరామమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి రూరల్ తహశీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా భీమిలి ఆర్‌డిఒ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం గోదాములను సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సిసి కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో గాదాముల లోపల పరిస్థితిని సమీక్షించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, బద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆయన వెంట భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాథూర్, రెవెన్యూ ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

సిసి కెమెరాల వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : హనుమంతువాక వద్ద గల ఆరిలోవ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు ఉపకార ఛారిటబుల్ ట్రస్టు అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు సీసీ కెమెరాలు, నూతన సౌండ్ సిస్టమ్‌ను వితరణగా అందజేశారు. ట్రస్టు కార్యాలయ సిబ్బంది నాగు ఆధ్వర్యాన వాటిని శుక్రవారం ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు. అన్ని వర్గాల ప్రజలకు సేవలందించేందుకు ఉపకార ట్రస్టు ముందుంటుందన్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రయాణికుల రక్షణ కోసం నిర్విరామంగా పనిచేస్తున్నారని, వారికి ఏవిధమైన సహాయసహకారాలైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ట్రస్టు అధినేత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు తెలిపారు.

వాడీవేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : సమస్యలపై నిరసనలు, నిలదీతలతో మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల వైస్ఎంపిపి బొలిశెట్టి గోవిందరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశంలో పలువురు అధికారులు తమ శాఖల పురోగతిని వివరించారు. ముందుగా వ్యవసాయశాఖ, ఆరోగ్యశాఖ, విద్యా శాఖ, ఆయుష్ శాఖలు తమ ప్రగతి ప్రణాళికలు వివరించారు. ఎజెండా ప్రకారం ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ప్రగతిని ఎఇఇ కళ్యాణ్ వివరించగా, వైస్ ఎంపిపి బొలిశెట్టి గోవిందరావు కలుగజేసుకుని, గ్రామాలలో జలజీవన్ మిషన్ పనుల పేరున రోడ్లు ఛిద్రం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుగ్రామాలలో నాసిరకం పైపులను వినియోగిస్తున్నారని సర్పంచులు, ఎంపిటిసిలు నిరసన తెలిపారు. వీటిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. గృహనిర్మాణశాఖ ద్వారా జరుగుతున్న చెల్లింపులపై అవకతవకలు జరుగుతున్నట్లు వాకపాడు సర్పంచ్ మైలపల్లి శ్రీను ప్రశ్నించారు. అధికారులు గ్రామాల సందర్శనలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులను పార్టీలకతీతంగా కలుపుకుని వెళ్లాలని వైస్ ఎంపిపి గోవిందరావు సూచించారు. అధికార పార్టీకే మొగ్గు చూపుతూ అధికారులు పనిచేస్తే ప్రతిపక్ష పార్టీగా అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించారు. బెదిరింపులకు అధికారులు భయపడవద్దని సూచించారు. తదనంతరం వైద్యఆరోగ్యశాఖ నివేదిక చేస్తుండగా సర్వసిద్ధి పిహెచ్‌సి వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ప్రజల ఆరోపణలపై నిలదీశారు. సర్వసిద్ధి ఆసుపత్రికి వచ్చిన నిధులు, వాటి ఖర్చుల వివరాలను తీసుకురావాలని వైస్ ఎంపిపి బొలిశెట్టి గోవిందరావు సూచించారు. శిధిలావస్థకు చేరుకున్న రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని ఆర్అండ్‌బి ఎఇని ప్రశ్నించారు కొరుప్రోలు గ్రామంలో ఆర్అండ్‌బిరోడ్డు ఆక్రమణలు తొలగించాలని, స్కూలు ఆవరణకు ఆనుకుని అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారినట్లు ఫిర్యాదులున్నాయని, వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఎంపిడిఓ సత్యన్నారాయణ సూచించారు. అనంతరం ఇరిగేషన్, ఎక్సైజ్ తదితర శాఖల ప్రణాళికలు తెలిపారు.కార్యక్రమంలో వైస్ ఎంపిపి చోడిపిల్లి అప్పన్న, జెడ్పిటిసి కాకర దేవి, డిటిఇ నీరజ సర్పంచులు, ఎంపిటిసిలు అధికారులు పాల్గొన్నారు.


మండల సభలో సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

నేడు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జాతీయ వినియోగదారుల దినోత్సవంలో భాగంగా ఈనెల 21న శనివారం ఉదయం పాతపోస్టాఫీస్ క్వీన్స్‌మేరీ హైస్కూల్లో 'వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు,డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై హైస్కూల్ స్థాయి విద్యార్థులకు వ్యాసరచన; వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ తృతీయస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈ నెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవంలో నగదు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేస్తారన్నారు. ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థిని రాష్ట్రపోటీలకు పంపుతామన్నారు.

నేడు జగన్ జన్మదిన వేడుకలు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జన్మదిన వేడుకలను ఈనెల 21న శనివారం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. పెద్ద బొడ్డేపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించే వేడుకల్లో భాగంగా ఉదయం కేకు కటింగ్ తర్వాత, మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ, మాకిరెడ్డి బుల్లి దొర, తమరాలన శ్రీను పాల్గొన్నారు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి -నక్కపల్లి : విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ డి సీతారామరాజు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఎపిఒ భాగ్యలత ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్, విఆర్‌పిలతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల వారీగా పనుల పురోగతిపై ఆరా తీశారు. కొంతమంది విఆర్‌పిలు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. మార్చి నాటికి వంద రోజులు పని దినాలు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు పేమెంట్లు విడుదల చేయాలని, వెంటనే సంబంధిత పనులకు రిపోర్ట్ అందజేయాలని సూచించారు. పనిచేయు ప్రాంతాల నుండి ఎప్పటికి అప్పుడు ఫోటోలను అప్ లోడ్ చేయాలన్నారు. కాగితంలో ఏర్పాటు చేయనున్న పల్లివనం పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

మహాలక్ష్మినాయుడు సేవలు ప్రశంసనీయం


ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డిఇఒ

ప్రజాశక్తి - రావికమతం : జిల్లాలో వికలాంగులకు వివిధ రకాలుసేవలు అందిస్తున్న మేడివాడ జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడును ఉత్తమ ఉపాధ్యాయునిగా గుర్తించిన జిల్లా విద్యాశాఖ అధికారి జి. అప్పారావు నాయుడు శుక్రవారం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనకాపల్లిలోని జివిఎంసి టౌన్ గర్ల్స్ హైస్కూల్లో ఎంఇఒల ఒక్కరోజు వృత్యంతర శిక్షణా కార్యక్రమంలో ఈ ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డిఇఒ అప్పారావు నాయుడు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసిన ప్రతి ఉద్యోగికి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల వద్ద గుర్తింపు ఉంటుందన్నారు. వికలాంగుల అభ్యున్నతికి ప్రభుత్వపరంగా విశేషసేవలు అందిస్తున్న మహాలక్ష్మినాయుడు అభినందనీయ ులన్నారు. వికలాంగ విద్యార్థులకు వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, ల్యాప్‌టాప్స్, బ్యాగ్స్, స్కాలర్‌షిప్‌లు, స్టైఫండ్, బస్సు పాసులు, ఇతర అన్ని పథకాలను అర్హులకు వర్తించేలా మహాలక్ష్మినాయుడు కృషి చేశారన్నారు. మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో ఇంటింటా సర్వేచేసి, వికలాంగబాలలకు భవిత కేంద్రంలో చేర్పించడంలోను, వారికి ఫిజియోథెరపీ, ఇతర ప్రయోజనాలను కల్పించడంతో సాయపడ్డారన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ జగదీష్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, స్టేట్ అబ్జర్వర్ ఎన్.అమ్మినాయుడు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల, సిడిపిఒ ప్రభావతి, ఆర్‌బిఎస్‌కె డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ మేనేజర్ శాంతిప్రియ, ఎంఇఒలు, వైద్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐఐపిఇ ఆధ్వర్యంలో శిక్షణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల విద్యార్థులకు నూతన పరిశోధనా పద్ధతులపై ఈనెల 21 నుంచి 23 వరకు మూడురోజులపాటు ఐఐపిఇ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఐఐపిఇ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన వెల్లడించారు. శుక్రవారం ఆంధ్ర యూనివర్సిటీలోని ఐఐపిఇ విభాగంలో మీడియాతో మాట్లాడుతూ సైంటిఫిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రామ్స్, కాలేజ్ అండ్ స్కూల్ టీచర్స్ ఎడ్యుకేషన్ అండ్ అకడమిక్ మెంటరింగ్ (సిఎస్‌టిమ్) ఆధ్వర్యంలో లోకల్ కాలేజ్ అండ్ స్కూల్ స్టూడెంట్స్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ (ఎల్‌సిఎస్ ఎస్‌ఎఫ్‌పి)లను నిర్వహిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ జిజ్ఞాస కార్యక్రమానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు విభాగాలలో తాజా పరిణామాలను బోధించి, అవగాహన కల్పిస్తామన్నారు. సబ్బవరం క్యాంపస్ నుంచి సంస్థ కార్యకలాపాలు ప్రారంభం కాగానే ఈ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను కేంద్రంగా చేసుకుని హబ్‌గా ఉండేందుకు ఐఐపిఇ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆర్అండ్‌డి డీన్ ప్రొఫెసర్ కె.విజయ్‌కుమార్ ఐఐపిఇ నిర్వహిస్తున్న వివిధ శాస్త్రీయ సామాజిక బాధ్యత కార్యక్రమాలను వివరించారు. ఐఐపిఇలో అందుబాటులో ఉన్న ఇన్‌స్ట్రుమెంటేషన్‌ను వివరించి, స్థానిక కళాశాల పాఠశాల ఉపాధ్యాయులకు పరిశోధనా పద్ధతులపై శిక్షణనిచ్చి, భవిష్యత్‌లో ప్రోత్సాహిస్తారన్నారు. ఆర్అండ్‌డి అసోసియేట్ ప్రొఫెసర్ పోలమరశెట్టి అప్పరాయ్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఎంపికలో అనకాపల్లి, విశాఖ జిల్లాల కలెక్టర్లు కీలక పాత్ర పోషించారని, రెండు జిల్లాల డిఇఒలు 25 మంది విద్యార్థులు, 20 మంది అధ్యాపకులను నామినేట్ చేశారన్నారు . బాలికా విద్యను ప్రోత్సహించడానికి, ఐఐపిఇ శిక్షణలో సగంమంది బాలికలను ఎంపిక చేసేలా చర్యలు చేపడుతున్నారు. మీడియా సమావేశంలో ప్రొఫెసర్ రంధి రాముసాయుడు పాల్గొన్నారు.

23న జెడ్‌పిలో దిశ సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 23న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విశాఖ ఎంపి శ్రీభరత్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశ) జిల్లాస్థాయి అభివృద్ధి సమన్వయ, మానటరింగ్ కమిటీ సమావేశం జరగనుందనిజిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ అన్నారు. . శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమన్వయ కమిటీ సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించారు సంబంధిత అధికారులంతా పక్కా నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పిఇ సిఇఒ పి.నారాయణమూర్తి, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను కలిసిన కృష్ణ

నేడు ఉప ముఖ్యమంత్రి స్వాగతానికి ఏర్పాట్లు


పవన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కృష్ణ

ప్రజాశక్తి- మాడుగుల : ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా విశాఖపట్నం వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను శుక్రవారం మాడుగుల నియోజక వర్గ జనసేన ఇంచార్జ్ రాయపు రెడ్డి కృష్ణ రాడిసన్ బ్లూ హోటల్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పినకోటలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శనివారం మాడుగుల నియోజకవర్గం కెకోటపాడు,దేవరాపల్లి మండలాల మీదుగా రోడ్డుమార్గంలో అనంతగిరి వెళ్లనున్న పవన్ కల్యాణ్‌ను దేవరాపల్లి జనసేన కార్యాలయం వద్ద ఘనస్వాగతం చెప్పేందుకు పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నట్లు కృష్ణ తెలిపారు.

చంద్రబాబు దృష్టికి '22ఎ' భూసమస్య

● ఉపమాక నివాసితుల ఇబ్బందులను విన్నవించిన బుజ్జి


ముఖ్యమంత్రికి సమస్యను వివరిస్తున్న బుజ్జి

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలో ఉపమాక ఆగ్రహారంలో 22ఎ భూ సమస్య పరిష్కరించాలని పమాక వెంకన్న ఆలయ మాజీ చైర్మన్, క్లస్టర్ ఇంచార్జ్ కొప్పిశెట్టి బుజ్జి కోరారు శుక్రవారం హోంమంత్రి వంగలపూడి సమక్షంలో అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి, సమస్యను విన్నవించి, వినతిపత్రం అందజేశారు. ఉపమాకలో సర్వే నెంబరు 112లోని 27.01 ఎకరాల భూమిని 22ఎలో నమోదు చేయడంతో క్రయ, విక్రయాలకు ఆస్కారం లేకుండారిజిస్ట్రేషన్లు ప్రక్రియను నిలుపుదల చేశారని, దీనివల్ల స్థిర నివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామ కంఠం భూమి 22ఎలో నమోదు కావడం వల్ల 2018 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రక్రియ నిలిపివేశారన్నారు. ఈ భూములు రిలీజియన్ ఆఫ్ ఛారిటబుల్ ఇనిస్టిట్యూషన్ కింద ఎండోమెంట్ భూములుగా నమోదై ఉన్నాయని, రిజిస్ట్రేషన్లు నిషేధించాలని కోరుతూ దేవాదాయ ధర్మదాయశాఖ నుంచి నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా ఉత్తర్వులు రావడంతో అప్పటి నుంచి క్రయవిక్రయాలకు ఆస్కారం లేకుండా పోయిందన్నారు. దీంతో స్థిర నివాసులు ఆవేదనకు గురవుతున్నారని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. 2018 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవన్నారు. అప్పట్లో వివాహాలు, చదువులు, ఇతర అవసరాల కోసం ఇల్లులు, ఖాళీ నివేదన స్థలాలు క్రయ విక్రయాలు జరుపుకునేవారన్నారు. ఇపుడు క్రయవిక్రయాలే కాదు. ఆయా స్థలాలపై రుణాలు దొరకక ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. దీనిపై కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్‌లకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఎస్ఎఫ్ఎ ప్రకారం భూమిని సబ్ డివిజన్ చేసి మిగిలి ఉన్న భూమిని గ్రామ ప్రజలకు గ్రామ కంఠం ఆస్తిగా పరిగణించి, పూర్వంలా యథావిధిగా రిజిస్ట్రేన్లు జరిగేలా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. చంద్రబాబును కలిసిన వారిలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు గోసల శ్రీకాంత్, వంగలపూడి శ్రీను పాల్గొన్నారు.